సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 21 । మార్చి । 2025




ప్రైవేటు హాస్టళ్ల ఇష్టారాజ్యం!

ప్రైవేటు హాస్టళ్లపై పర్యవేక్షణ కరువైంది. దీంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. 8లో ▸



24 నుంచి బ్రహ్మోత్సవాలు

పేదల తిరుపతిగా పేరొందిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు 24 నుంచి ప్రారంభం కానున్నాయి. 9లో ▸



న్యూస్‌రీల్

ఆర్టీసీ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- కాంగ్రెస్ హయాంలోనే లాభాల బాట
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



జెండా ఊపి కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ హయాంలో నష్టాల ఊబిలో ఉన్న ఆర్టీసీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే లాభాల బాటలో నడుస్తోందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పరిగి డిపోకు వచ్చిన 5 కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ అభ్యున్నతికి పెద్ద పీట వేస్తోందన్నారు. సంస్థను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పరిగి ఆర్టీసీ డిపోకు పూర్వ వైభవం తీసుకువస్తామని తెలిపారు. డిపోకు మొత్తం 17 కొత్త బస్సులు వస్తాయని ఇప్పటి వరకు 9 బస్సులు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, వైస్ చైర్మన్ అయూబ్, ఆయ మండలాల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని ఆదేశించారు. శుక్రవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండటంతో గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసు అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలన్నారు. జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేశాకే లోపలికి అనుమతించాలని తెలిపారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లరాదని సూచించారు. ఈ నిబంధన సిబ్బందికి కూడా వర్తిస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీఈఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించిందని, ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ పథకం కింద షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ప్రణాళికను ఆమోదించిందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కలెక్టరేట్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ అధికారులను సంప్రదించాలన్నారు.



రెండేళ్ల క్రితం వేసిన రోడ్డుపైనే మళ్లీ పోసిన మట్టి

మట్టి పోశారు.. లక్షలు దోచారు!

అటవీశాఖలో అవినీతి జలగలు

అటవీశాఖ అధికారులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. రెండేళ్ల క్రితం రూ.6 లక్షలతో పూర్తి చేసిన వాకింగ్ పాత్ పనులను మళ్లీ చేపట్టి రూ.లక్షలు స్వాహా చేశారు.. టెండర్లు పిలవకుండానే పనులు చేసి బంధువుల ఖాతాల్లోకి నిధులు మళ్లించారు. పనుల్లో నాణ్యతైనా పాటించారా అంటే అదీ లేదు.. మట్టిపోసి.. చదును చేసి.. రోడ్డు రోలర్‌తో నాలుగు సార్లు అటూ ఇటూ తిప్పి వదిలేశారు. 'సాక్షి' పరిశోధనలో ఇలాంటి అనేక విషయాలు వెలుగు చూశాయి.



అంతారం వద్ద అటవీ శాఖ అర్బన్ పార్క్ ముఖద్వారం

- అంతారం – గొట్లపల్లి అర్బన్ పార్కు పనుల్లో అక్రమాలు
- టెండర్లు పిలవకుండానే రూ.16 లక్షల విలువ చేసే పనులు
- కాంట్రాక్టర్ అవతారమెత్తిన ఇద్దరు అధికారులు
- బంధువుల ఖాతాల్లోకి నిధుల మళ్లింపు
- 'సాక్షి' పరిశోధనలో వెలుగులోకి..

బషీరాబాద్: తాండూరు మండలం అంతారం – గొట్లపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ 40లో సుమారు 111 ఎకరాల్లో 2020 – 21లో అటవీ శాఖ అర్బన్ పార్కు పనులు చేపట్టింది. అప్పట్లో క్యాంప పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.1.35 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పార్కు చుట్టూ 3 కి.మీ. ఫెన్సింగ్ వేశారు. టికెట్ గదులు, ఇతర పనులు పూర్తి చేశారు. అలాగే పార్కులో పర్యాటకులు తిరిగేందుకు 2022 – 23లో రూ.6 లక్షలతో 4 మీటర్ల వెడల్పుతో వాకింగ్ పాత్(మట్టిరోడ్డు) నిర్మించారు. 2024 సెప్టెంబర్‌లో ఇవే వాకింగ్ పాత్ పనులకు కేంద్ర ప్రభుత్వం నగరవాణి యోజన కింద రూ.16 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను వంద శాతం మట్టితో చేయాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న అటవీ శాఖ బీట్ ఆఫీసర్, సెక్షన్ అధికారి కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. గతంలో చేసిన పనులను మళ్లీ చేసి నిధులు కాజేశారు. సదరు అధికారులు వారి సమీప బంధువుల ఖాతాల్లోకి రూ.16 లక్షలు మళ్లించి ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారు.

కఠిన నిబంధనలను బేఖాతరు చేసి..

అటవీ శాఖ చట్టాలు, నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. అడవిలో చెట్లను నరికితే టన్నుకు రూ.2,665 జరిమానా విధిస్తారు. అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాలు చేపడితే క్యూబిక్ మీటర్‌కు రూ.529 జరిమానా తోపాటు ఐదు రెట్లు అదనంగా ఫైన్ వేస్తారు. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల లోపు నిధులకు సంబంధించి పనులను పిట్టి కాంట్రాక్టర్‌కు అప్పగించి చేయించాలి. పనులు పూర్తయితే బీట్ ఆఫీసర్ ఎస్టిమేషన్ ప్రకారం ఎంబీ రికార్డు చేయాల్సి ఉంటుంది. కానీ రూ.16 లక్షల విలువ చేసే వాకింగ్ పాత్ పనులకు ఎలాంటి టెండర్లు పిలవకుండా పనులు పూర్తి చేశారు. ఎంబీ రికార్డు చేసి నిధులు కాజేశారు.

పార్కులోని మట్టినే తవ్వి..

వాకింగ్ పాత్‌కు ఎర్రమట్టిని వినియోగించాలి. అయితే సదరు అధికారులు అంజత్ అనే వ్యక్తికి పనుల బాధ్యతలు అప్పగించారు. పార్కులోని మట్టినే వినియోగించాలని సూచించారు. దీంతో ఆ వ్యక్తి సుమారు 4వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి రోడ్డు పనులకు వినియోగించాడు. మట్టి తీసే క్రమంలో దాదాపు 10 టన్నుల కలపను అమ్ముకున్నారు. బయట నుంచి ఒక్క ట్రిప్పు మట్టి కూడా తేలేదని 'సాక్షి' పరిశీలనలో తెలిసింది.

ఉన్నతాధికారులు చెబితేనే పనులు చేశాం



పార్కులో వాకింగ్ పాత్ కోసం రూ.16 లక్షలతో అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులు పంపారు. ఈ పనులు చేయాలని వారు సూచించడంతో బీట్ ఆఫీసర్ మల్లయ్య, ఎఫ్‌ఆర్‌ఓగా నేను కలిసి డబ్బు పెట్టి పనులు చేశాం. గతంలో కూడా టెండర్లు లేకుండానే అధికారులు పనులు చేశారు. అదే తరహాలో మేము మా బంధువుల వద్ద అప్పు తెచ్చి పనులు చేశాం. బీట్ ఆఫీసర్ ఎంబీ చేశాడు. నేను మెజర్‌మెంట్ చేస్తే ఎఫ్‌ఆర్‌ఓ బిల్లులు పాస్ చేశారు. ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ జరిగింది. మా బంధువుల ఖాతాల్లో నగదు జమ చేశాం.

– పీర్యానాయక్, ఎఫ్‌ఆర్‌ఓ, తాండూరు

నిబంధనల ప్రకారమే..



పట్టణ ప్రజల సౌకర్యార్థం అర్బన్ పార్కును నిర్మిస్తున్నాం. నిబంధనల మేరకే పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాం. రోడ్డుకు అవసరమైన కొంత మట్టిని ఓ కాంట్రాక్టర్ ద్వారా బయటి నుంచి తెప్పించి వినియోగించాం. పార్కు పరిసరాల్లో ఎర్రమట్టి ఉండటంతో రోడ్డు కోసం వాడాం. పనికిరాని శీకిరాణీ చెట్లను తొలగించాం. ఈ వ్యవహారంలో నన్ను ఇరికించి బలిపశువును చేస్తున్నారు.

– శ్రీదేవి సరస్వతి, ఎఫ్‌ఆర్‌ఓ, తాండూరు

బంధువుల బ్యాంక్ ఖాతాల్లోకి..

పార్కు చుట్టూ వేసిన రోడ్డుకు తాండూరు ఫారెస్టు బీట్ ఆఫీసర్ మల్లయ్య, సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్ ఎంబీ రికార్డు చేశారు. 3.2 కి.మీ. పొడవు రోడ్డు ఉంటే 3 కి.మీ. మేర 5 మీటర్ల వెడల్పు.. 15 సెం.మీ. ఎత్తున 4వేల క్యూబిక్ మీటర్ల మట్టిని పోసినట్లు ఎంబీ రికార్డు చేశారు. ఎస్టిమేషన్‌లో 2,400 క్యూబిక్ మీటర్ల మట్టిని పోయాలని ఉంటే.. తాము ఎక్కువ పని చేసినట్లు రికార్డులు రాసుకున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులు గత యేడాది డిసెంబర్‌లో బీట్ ఆఫసర్ మల్లయ్య అల్లుడు ఎస్.ప్రవీణ్‌కుమార్ ఖాతాలో రూ.7,43,500, అలాగే సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్ బంధువు రాజ్‌కుమార్(బాల్‌నగర్) ఖాతాలో రూ.3,20,000 జమ చేశారు. అలాగే పనులు చేసిన అంజత్ ఖాన్ అనే వ్యక్తికి రూ.4,11,000 చెల్లించారు. తెలిసిన వ్యక్తుల ఖాతాల్లో రూ. 1,25,500 వేసి కాజేశారు. వాస్తవానికి ఈ పనుల్లో ఎక్కడా కంకర, సిమెంట్, ఇసుక, ఐరన్ వంటి మెటీరియల్ వాడలేదు. కేవలం యంత్రాలను ఉపయోగించి మట్టిని తవ్వి చదును చేశారు. తనకు చెల్లించిన డబ్బుతో 90శాతం పనులు పూర్తి చేసినట్లు అంజత్ తెలిపాడు. అంటే ఈ లెక్కన సుమారు రూ.10లక్షల పైనే అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ వ్యవహారంలో మరికొందరి అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అర్బన్ పార్క్ పరిధిలో ఎర్రమట్టి తీసిన ప్రాంతం



నాణ్యత లేని వాకింగ్ పాత్ పనులు

పిల్లలను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న అనితా రామచంద్రన్

- మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్

అనంతగిరి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుందామని మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పిల్లల బాధ్యతలపై సీడీపీఓలు, సూపర్ వైజర్లు, సఖీ, ఐసీపీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పిల్లలను వారి తల్లిదండ్రులతో మాత్రమే ఇళ్లకు పంపాలని ఆదేశించారు. పిల్లల్లో శారీరక వైకల్యం, ఫిట్స్, ఉబ్బసం, ఆకస్మిక కదలికలు, స్పృహ తప్పడం, వినికిడి సమస్య, కారణం లేకుండా శిశువు ఏడ్వడం, మానసిక సమస్యలను గుర్తించి అవసరమైన చికిత్స చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సామ్, మామ్ పిల్లలు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. ముందుగా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ సమస్యలతో బాధపడే 140 మంది పిల్లల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. గ్రామాల్లో పర్యటించి వారం రోజుల్లో అనారోగ్యంతో బాధపడే పిల్లల వివరాలు సేకరించాలన్నారు. శస్త్ర చికిత్సల కోసం కృషి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్ శాఖ డైరెక్టర్ శైలజ, ఆర్జేడీ మోతి, రాష్ట్ర పీడీపీఓ అరుణ, డీపీవో జయసుధ, మానసిక వైద్యులు డాక్టర్ శ్రవణ్ రెడ్డి, రుషికేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గిరిజనుల సంక్షేమం




మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్


స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: గిరిజనుల హక్కులు కాపాడాలన్నా.. వారికి సంక్షేమ పథకాలు అందాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టపై మూడు రోజులుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమావేశం జరుగుతోంది. గురువారం ముగింపు కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ తీసుకువచ్చి రాహుల్‌గాంధీని పీఎం చేయడానికి శ్రమించాలని పిలుపునిచ్చారు. అప్పుడే ఇందిరా గాంధీ సూచించిన ఇరవై సూత్రాల కార్యక్రమం అమలువుతుందని, గరీబీ హఠావో సాకారం అవుతుందన్నారు. నేడు గిరిజనులు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నారంటే కాంగ్రెస్ హయంలో కల్పించిన రిజర్వేషన్లే కారణమని అన్నారు. నేను ఈ రోజు రాష్ట్ర స్థాయిలో ఉన్నతమైన పదవిలో ఉన్నానంటే దానికి కారణం భారతరత్న బీఆర్ అంబేడ్కర్ దళిత, గిరిజన వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ దేశంలో ప్రకృతి సంపదపై మొదటి హక్కు గిరిజనులవే అన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి రూ.17,167 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో ట్రైకార్ కింద నిరుద్యోగ గిరిజన యువకులకు ఉపాధి కల్పించడానికి ఈ ఒక్క ఏడాదికి రూ.1,360 కోట్లు కేటాయించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం తండా అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు విక్రాంత్ బురియా, ఆదివాసీ కాంగ్రెస్ కన్వీనర్ రాహుల్ బల్‌జీ, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్‌టీఏ సభ్యులు ఎర్రవల్లి జాఫర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.


భరించలేకే.. చంపేశాం

- పోలీసుల విచారణలో అంగీకరించిన మృతుడి భార్య, తల్లి
- వివరాలు వెల్లడించిన పెద్దేముల్ ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి
- నిందితులకు రిమాండ్





నిందితులు సబిత, లక్ష్మమ్మ



హత్యకు గురైన వెంకటేశ్ (ఫైల్)

తాండూరు రూరల్: వేధింపులు భరించలేకనే వెంకటేశ్‌ను హత్య చేశామని అతని భార్య సబిత, తల్లి లక్ష్మమ్మ పోలీసుల విచారణలో అంగీకరించారు. పెద్దేముల్ ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని హన్మాపూర్ గ్రామానికి చెందిన బక్కని వెంకటేశ్ (33) వ్యవసాయం, కూలీ పనులు చేసేవాడు. మద్యానికి బానిసైన ఆయన నిత్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గత బుధవారం రాత్రి కూడా ఇంట్లో గొడవపడ్డాడు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న వెంకటేశ్‌పై అత్తాకోడళ్లు దాడి చేశారు. ఇనుప రాడ్లతో తలపై మోదడంతో అక్కడికక్కడే చనిపోయాడు. అనంతరం మృతుడి సోదరుడైన శ్రీనివాస్ ఇంటికి వెళ్లి విషయం చెప్పి, పరారయ్యారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించారు. తండ్రి హత్యకు గురవడం, తల్లి, నాయనమ్మ జైలుకు వెళ్లడంతో చిన్నారులు లావణ్య, కిషోర్ దిక్కులేనివారయ్యారు.



మల్కాపూర్ సెంటర్‌లోని ఓ గదిలో ఫ్యాన్ల దుస్థితి

ఇదేం పరీక్ష కేంద్రం

మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో శుక్రవారం నుంచి 196 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం స్కూల్‌లోని ఏడు గదులను కేటాయించారు. కానీ ఎలాంటి వసతులు కల్పించలేదు. ఓ పరీక్ష గదిలో రెండు ఫ్యాన్లు పాడైపోగా.. మరో గదిలో అసలు ఫ్యాన్లే లేవు. సెంటర్‌కు ఓ వైపు ప్రహరీ లేదు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. తనిఖీకి వచ్చిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అసంతృప్తి వ్యక్తంచేశారు.

– తాండూరు రూరల్



పాఠశాలలోని ఓ గదిలో మూలన పడేసిన పాఠ్యపుస్తకాలు

పరీక్ష గది.. చెత్తమయం

దౌల్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాలను చిందరవందరగా పడేశారు. ఈ స్కూల్‌లో శుక్రవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సెంటర్‌ను పరిశీలించేందుకు వచ్చిన తహసీల్దార్ గాయత్రి, ఎంఈఓ వెంకట్ స్వామి ఓ గదిలో చిరిగిపోయి, మూలన పడేసిన పుస్తకాలను చూసి అసహనం వ్యక్తంచేశారు.24గంటల్లో ఎగ్జామ్ నిర్వహించాల్సిన గది ఇంత అపరిశుభ్రంగా ఉండటం ఏమిటని మండిపడ్డారు.

– దౌల్తాబాద్

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపిక



ఉపన్యాస పోటీలో మాట్లాడుతున్న శివలీల

తాండూరు టౌన్: వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలకు తాండూరుకు చెందిన డిగ్రీ విద్యార్థిని ఎంపికైంది. పట్టణంలోని సింధు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(ఎంపీసీఎస్) ఫైనలియర్ చదువుతున్న ఆర్.శివలీల ఈఘనత సాధించింది. ఒకే దేశం , ఒకే ఎన్నిక (జమిలి ఎన్నిక) అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో 82 శాతం పాయింట్లతో ఆమె ఐదో స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ వేదికగా జరగనున్న ఉపన్యాస పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకుడు వి.రంగారావు, ప్రిన్సిపాల్ విజయాదేవి, వైస్ ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి, అధ్యాపక బృందం, సహచరులు శివలీలను అభినందించారు.

శోభాయమానంగా పాంబండ బ్రహ్మోత్సవాలు



రుద్రహోమంలో పాల్గొన్న భక్తజనం

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి సమయంలో భక్తుల ఆటపాటల మధ్యన ఉత్సవమూర్తి బండవెల్కిచర్ల గ్రామ అర్చకుల ఇంటి నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవాలలో భాగంగా పల్లకీసేవ నిర్వహించారు. గురువారం ఆలయంలో రుద్ర హోమం కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తమను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

సునీతా విలియమ్స్ రాకపై సంబురాలు



ఫొటో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

బషీరాబాద్: భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ క్షేమంగా భూమికి తిరిగి రావడంతో విద్యార్థులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. మండలంలోని కొరివిచెడ్ ఎంపీపీఎస్‌లో గురువారం హెచ్‌ఎం నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి దిగివచ్చిన చాయచిత్రాలు గీసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. మహిళలు తలుచుకుంటే ఏదైన సాధిస్తారనే దానికి సునీతా విలియమ్స్ నిదర్శనమన్నారు. ఆమెను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాజియా, జయశ్రీ, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భార్యాపిల్లలు వదిలి వెళ్లారని మనస్తాపం

దోమ: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బ్రాహ్మణపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె వెంకటయ్య(35)కు భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేసే ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో నిత్యం భార్యతో పాటు కుటుంబ సభ్యులను దుర్భాషలాడటంతో పాటు దాడి చేసే వాడు. దీంతో విసిగిపోయిన భార్య పిల్లలను తీసుకుని పదిహేను రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో వెంకటయ్య తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. గురువారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న పాదచారులు చూసి కుటుంబ సభ్యుల కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించా రు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేటు హాస్టళ్ల ఇష్టారాజ్యం!

ప్రైవేటు హాస్టళ్లపై పర్యవేక్షణ కరువైంది. పట్టించుకునే వారు లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజుల దోపిడీతో పాటు.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయి. విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నాయి. దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక, చదువును మధ్యలో మానేయలేక అభద్రతాభావంతో బతుకులీడుస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

- అడ్డగోలుగా ఫీజుల వసూలు
- వసతిగృహం మాటున అఘాయిత్యాలు
- ప్రశ్నార్థకంగా విద్యార్థినుల భద్రత



ఆదిబట్ల మున్సిపాలిటీలో హాస్టళ్లు



మంగళ్‌పల్లిలో వసతిగృహాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలు విద్యాసంస్థలకు నిలయంగా మారాయి. రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉండటంతో సుమారు 40 వరకు ప్రైవేటు ఇంజినీరింగ్, ఇంటర్మీడియెట్ కళాశాలలు, కార్పొరేట్ విద్యాసంస్థలు నెలకొన్నాయి. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా.. అనేక మంది విదేశాల నుంచి సైతం వచ్చి ఇక్కడే విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా స్థానిక వసతి గృహాల్లో ఉంటున్నారు.

అనుమతి రెసిడెన్షియల్.. నిర్మాణం?

ఇబ్రహీంపట్నం మండలం, మున్సిపాలిటీ, ఆదిబట్ల పురపాలికలోని మంగళ్‌పల్లి, టీసీఎస్ ఎదుట అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. రెసిడెన్షియల్ అనుమతితో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. జీప్లస్– 2 పర్మిషన్ పొంది, నాలుగైదు అంతస్తులు లేపారు. ఇలా మొత్తం 300 వరకు హాస్టళ్లు వెలిశాయి. ఒక్కో వసతిగృహంలో 100 నుంచి 150 మంది విద్యార్థులు ఉండగా.. ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.6 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. విద్యార్థులతో కలిపి మొత్తం 30 వేల మందికిపైగా ప్రైవేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సైతం హాస్టళ్లలో గడుపుతున్నారు.

కొరవడిన భద్రత..

హాస్టళ్లలో భద్రత కొరవడింది. విద్యార్థులు, ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించకుండానే నిర్వహిస్తున్నారు. పీల్చుకోవడానికి గాలి, చదువుకోవడానికి వెలుతురు కూడా లేదని పలువురు వాపోతున్నారు. ఇక సీసీ కెమెరాలు లేవు. అగ్నిమాపక శాఖ అనుమతితో పాటు.. అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే మంటలు ఆర్పడానికి ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఎక్కడా కనిపించడం లేదు. వీటికి ఎన్‌ఓసీ, ట్రేడ్ లైసెన్స్, అనుమతి అనే మాటలే తెలియదు. కేవలం పుద్దు, బెడ్డుతో సరిపెట్టి దండుకుంటున్నారు.

అఘాయిత్యాలు!

వసతి గృహాల పేరుతో పలువురు నిర్వాహకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇటీవల మంగళ్‌పల్లిలోని ఓ హాస్టళ్లో ఇంజినీరింగ్ విద్యార్థినిపై లైంగిక దాడి జరిగింది. అదే ప్రాంతంలో ఒకటి, రెండు హాస్టళ్లలోని విద్యార్థినులను లోబర్చుకొని గోవా తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. కానీ ఇవేవి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. టీసీఎస్ ఎదుట నిత్యం వికృత చేష్టలకు ఒడిగడుతున్నారు. పర్యవేక్షణ కొరవడంతో నిర్వాహకులతో పాటు.. విద్యార్థులు, ఉద్యోగులు దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ



ఇబ్రహీంపట్నం, మంగళ్‌పల్లి, ఆదిబట్ల ప్రాంతాల్లో చాలా హాస్టళ్లు ఉన్నాయి. వీటిని పట్టించుకునే వారు లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయి. విద్యార్థులకు నాసిరకమైన భోజనం పెడ్తున్నారు. అధికారులు పర్యవేక్షించాలి. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– బాయికాడి శంకర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

కట్టడి చేస్తున్నాం



ప్రైవేటు హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. నిర్వాహకుల నిర్లక్ష్యం పెనవేసుకుంది. తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఏమైనా అసాంఘిక సంఘటనలు జరిగితే బాధ్యులవుతారు. ఇప్పటికే మంగళ్‌పల్లిలో ఓ వసతి గృహాన్ని మూసివేశాం. అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతాం. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి. పోలీసులు అండగా ఉంటారు.

– జగదీశ్వర్, సీఐ, ఇబ్రహీంపట్నం

ఇఫ్తార్ విందు.. పసందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పట్టణం మధుకాలనీలోని మదర్సాలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలకు ఆయన ఖర్జూరా తినిపించి ఉపవాస దీక్ష విరమింపచేశారు. అనంతరం పసందైన విందును ఆరగించారు. కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగ పోరాటం ఎనలేనిది



కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మంద కృష్ణ మాదిగ అని పలువురు కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా గురువారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కృష్ణ మాదిగ పోరాట ఫలితంగా ఈనెల 18న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్టీలకు అతీతంగా ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సిములుమాదిగ, ఆనంద్‌కుమార్ మాదిగ, స్వామిదాస్, కృష్ణ, మహేందర్, రాములు, బాల్‌రాజు, రవి, జగదీష్, మాణిక్యం, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సేవలో విద్యార్థులు

కుల్కచర్ల: పదో తరగతి పరీక్షలు ప్రారంభమౌతున్న నేపథ్యంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో స్థానిక ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. చౌడాపూర్ మండలంలో 99, మరికల్‌లో 152మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఎంఈఓ రాంచందర్ తెలిపారు.



పాంబండలో పదో తరగతి విద్యార్థులు

పదింతల ఉత్సాహంతో రాయండి

జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న జిల్లాలోని విద్యార్థులందరికీ ఎస్పీ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో ముందుస్తుగా అభినందనలు తెలిపారు. శుక్రవారం పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద ఎవరూ గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. పరీక్ష కేంద్రాల లోపలికి సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ కేంద్రాలు పరీక్ష సమయంలో మూసివేయాలన్నారు. ఎవరైనా కేంద్రాల దగ్గర చట్టవిరుద్ధమైన పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఎవరికైనా ట్రాఫిక్ ఇబ్బందులు కలిగితే డయల్ 100కి కాల్ చేసి పోలీసు అధికారులకు తెలియజేయాలని ఎస్పీ పేర్కొన్నారు.



తాండూరు పట్టణంలోని పరీక్ష కేంద్రం వద్ద ఉత్సాహంగా సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. మాస్ కాపీయింగ్ జరగకుండా సిబ్బంది గట్టి చర్యలు తీసుకున్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి రోజు పరీక్ష రాసి బయటికి వచ్చిన విద్యార్థులు కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడిపారు. తోటి విద్యార్థులతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు.

– తాండూరు టౌన్



పరీక్షలు పూర్తి కావడంతో విజయకేతనం చూపుతున్న ఇన్విజిలేటర్లు

16 మందికి కారుణ్య నియామకాలు

అనంతగిరి: వికారాబాద్ జిల్లాలో కారుణ్య నియామకం కింద 16 మందిని ఎంపిక చేశారని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపికైన వారిని బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు రవీంద్ర భారతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరికి నియామక పత్రాలు అందజేశారని తెలిపారు.



ఎంపికైన వారితో బయలు దేరుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

తైబజార్‌కు వేలం

రూ.12.70 లక్షలకు దక్కించుకున్న నీలకంఠ

కొడంగల్ రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ బలరాంనాయక్ ఆధ్వర్యంలో 2025–26వ సంవత్సరానికి గాను తైబజార్ వేలం నిర్వహించారు. డీ నీలకంఠ, సయ్యద్ నసీర్ పాషా, లోమ్టె నాగరాజు, కె.శివకుమార్ వేలంలో పాల్గొన్నారు. నీలకంఠ రూ. 12లక్షల 70వేల రూపాయలకు పాట దక్కించుకున్నారు. అనంతరం ఆయన్ను మున్సిపల్ కమిషనర్, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సి.ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమసిన వివాదం.. కలిసిన దాయాదులు



ఎంపీఓ ఆధ్వర్యంలో ఒప్పందం కుదిరి చేతులు కలిపిన దాయాదులు

బొంరాస్‌పేట: ఇంటి స్థలం విషయంలో దాయాదుల మధ్య కొనసాగుతున్న ముప్పై ఏళ్ల గొడవకు ఎట్టకేలకు తెరపడింది. మూడు దశాబ్దాలుగా కయ్యానికి కాలు దువ్విన వారంతా.. డీపీఓ, ఎంపీఓ చొరవతో చేతులు కలిపి ఒక్కటయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రేగడి మైలారం గ్రామానికి చెందిన తలారి హన్మయ్య, పెద్దయ్య, చంద్రయ్య దాయాదులు. నాగులకుంట కట్ట బజారుకు ఆనుకొని ఉన్న హన్మయ్య ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని ఆయన కొడుకు శేఖర్ ఆక్రమించాడని, దీంతో తమ ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బంది కలుగుతోందని దాయాదులైన తలారి ఎల్లప్ప, అనంతయ్యతోపాటు వీరి పక్కనే ఉండే మంగలి నర్సింలు, మంగలి వెంకటయ్య తదితరులు శేఖరయ్యతో పలుమార్లు గొడవ పడ్డారు. ఆక్రమించారని చెబుతున్న స్థలంలో వేసిన గుడిసెను తొలగించారు. దీంతో తనపై కక్షకట్టి దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ శేఖరయ్య డీపీఓకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గురువారం విచారణకు వచ్చిన ఎంపీఓ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు. దీనికి ఇరు పక్షాలు అంగీకరించడంతో కొలతలు చేసి, హద్దులు నిర్ధారించారు. అనంతరం ఒకరితో ఒకరికి కరచాలన చేయించారు.

వన హననం!



చెట్లను నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

జీవజాతి మనుగడలో ప్రకృతి సమతుల్యం ప్రధానమైనది. వృక్ష సంపద ఉన్నంత వరకూ ప్రాణకోటికి ఎలాంటి ముప్పు లేదు. ప్రాణవాయువు అందించే వనసంపద ఇందులో అతిముఖ్యమైనది. ఆక్సిజన్ లేక పోతే ఏజీవి ప్రాణమైనా నిమిషాల్లో అంతం కావాల్సిందే. ఇంతటి ప్రాధాన్యం ఉన్న చెట్లు, అరణ్యాలు క్రమంగా క్షీణిస్తున్నాయి. జిల్లాలో ఏటా తగ్గుతున్న అటవీ విస్తీర్ణం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. దశాబ్దకాలంగా హరితహారం, వన మహోత్సవాల పేరుతో ప్రభుత్వం విరివిగా మొక్కలు నాటిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. నేడు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ప్రాణ కోటికి ప్రమాద ఘంటికలు
- జిల్లాలో 12.9 శాతమే అటవీ విస్తీర్ణం
- 10 వేల ఎకరాలకుపైగా అన్యాక్రాంతం
- ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్ అంధకారమేనంటున్న నిపుణులు

తాండూరు: జిల్లావ్యాప్తంగా 33.3 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలి. కానీ ఇది 12.9 శాతానికై పరిమితమైంది. 1.08 లక్షల ఎకరాలల్లో అటవీ భూములు విస్తరించి ఉన్నాయి. జిల్లా పరిధిలో అనంతగిరి, ధారూరు ప్రాంతాల్లో చిట్టడవులు ఉండగా, మిగిలిన మండలాల్లో అటవీ విస్తీర్ణం నామమాత్రంగానే కనిపిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ– కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో వందల ఎకరాల అటవీ భూములను కర్ణాటక వాసులు కబ్జా చేశారు. దీనిపై చర్యలకు ప్రయత్నించగా విఫలమయ్యాయి. మరో వైపు ప్రభుత్వాలు గిరిజనులకు పోడు భూముల పేరిట 2,500 ఎకరాల వరకు పట్టాలు ఇచ్చాయి. అంతేకాకుండా మరో 6 వేల ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు లెక్కలు తేల్చారు. పట్టాలు, కబ్జాలతో అటవీ సంపద 9 వేల ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైంది. అంతేకాకుండా జిల్లాలోని పెద్దేముల్, బషీరాబాద్, కోట్‌పల్లి, బంట్వారం, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, వికారాబాద్ మండలాల్లోని అటవీ భూములలో క్రషర్ మిషన్లు, సుద్ద పరిశ్రమలను ఏర్పాటు చేసి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి.

ఆరోగ్యానికి శ్రీరామరక్ష

జీవ వైవిధ్యంలో అడవులది ప్రధాన పాత్ర. మనిషికి స్వచ్ఛమైన ఆక్సిజన్ అరణ్యాల ద్వారనే అందుతోంది. ఔషధ గుణాలు లభించే మొక్కలు దొరుకుతాయి. వర్షాలు కురవాలన్నా చెట్లు ఉండాల్సిందే. అలాంటి అడవుల సంరక్షణపై ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టకపోతే భవిష్యత్ తరాల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జిల్లాలో అన్యాక్రాంతమైన అటవీ ప్రాంతం

తగ్గిపోతున్న విస్తీర్ణం

జిల్లాలోని పట్టణాలు, గ్రామాలలో ప్రతి ఇంటి ముందు మొక్కలను పెంచాలనే నిబంధనలున్నాయి. ఇటీవల వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి పట్టణ ప్రాంతాలు బాగా విస్తరిస్తున్నాయి. ఇళ్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఆ స్థాయిలో మొక్కల పెంపకం చేపట్టడం లేదని బహిరంగా రహస్యమే. గతంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు పొందాలంటే తప్పని సరిగా చెట్లు పెంచాలనే నిబంధన ఉంది. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు.

తాండూరులో మనుగడ కష్టం

తాండూరు ప్రాంతంలో 5 సిమెంట్ కర్మాగారాలు, 900 వరకు నాపరాతి, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. వీటి ద్వారా వచ్చే కాలుష్యం ప్రమాదకరంగా మారుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం కర్మాగారాలు, నాపరాతి పరిశ్రమల యాజమాన్యాలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో తాండూరు ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. క్రమంగా మనిషి జీవితకాలం తగ్గిపోతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుండటం మరో శరాఘాతం. అభివృద్ధి పేరుతో వందలాది ఎకరాల్లో ఉన్న చెట్లను నరికి నాశనం చేస్తున్నారు. వన్యప్రాణులు, పశుపక్ష్యాదుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

17 నర్సరీలు ఏర్పాటు



జిల్లాలో ప్రస్తుతం 12.9 శాతం అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో కొంత అన్యాక్రాంతమైంది. పదేళ్లలో కబ్జాలను విడిపించి 2,500 ఎకరాల అటవీ భూముల్లో మొక్కలు నాటించాం. మరో పదేళ్లలో 10.50 లక్షల మొక్కలను నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. 17 నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నాం. వచ్చే సీజన్‌లో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకిరువైపులా 20 కిలోమీటర్ల మేర మొక్కలను నాటుతున్నాం. ప్రతిఒక్కరూ అడవులను సంరక్షించేందుకు ముందుకు రావాలి.

– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి

దంపతుల హత్య కేసులో.. నిందితులకు జీవిత ఖైదు

ధారూరు: దంపతులను హత్య చేసిన నిందితులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఎస్పీ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగసముందర్ గ్రామానికి చెందిన చౌట మల్లేశం తన దాయాది కుటుంబానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇది గమనించిన ఆమె కొడుకు వెంకటేశం 6జూన్ 2012న.. మల్లేశంను హత్య చేశాడు. ఈ విషయమై మల్లేశం తమ్ముడు బాలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అనంతరం వెంకటేశం జైలుకు వెళ్లగా.. వీరి కుటుంబంపై కక్ష పెంచుకున్న మల్లేశం బంధువు బందెప్పతో పాటు మరో ఆరుగురు డిసెంబర్ 24, 2012న వెంకటేశం తల్లిదండ్రులు నర్సింలు, అంజమ్మ, అక్క బాలమణిపై దాడి చేశారు. ఈ ఘటనలో నర్సింలు, అంజమ్మ మరణించగా బాలమణి కొన ఊపిరితో బయటపడింది. దాడి సమయంలో బాలప్ప ఇంట్లో లేడు. ఈ కేసును విచారించిన వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి.. నిందితులైన చౌట లక్ష్మి, కుర్వ గోపాల్, కుర్వ అంజయ్య, చౌట పెంటమ్మ, కుర్వ లక్ష్మిలను దోషులుగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.2 వేల చొప్పున జరిమానా విధించారని ఎస్పీ తెలిపారు. కేసు విచారణ సమయంలోనే బందెప్పతో పాటు మరో వ్యక్తి చనిపోయారు.